క్లుప్తంగా

వైభవంగా గోదాదేవి కల్యాణం



చేబ్రోలు పాండురంగస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉంగుటూరు: చేబ్రోలులో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పాండురంగస్వామి ఆలయంలో అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కల్యాణాన్ని గ్రామంలోని భక్తులు తరలివచ్చి తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ



శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

పెదపాడు: అయోధ్యలోని శ్రీరాముని పూజించిన అక్షింతలను రామభక్తులు ఆదివారం పంపిణీ చేసారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పెదపాడులో ఇంటింటా తిరుగుతూ శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. జైశ్రీరామ్ అంటూ భగన్నామస్మరణ చేసుకుంటూ అందరికీ అక్షింతలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పెదపాడులోని వీరాంజనేయస్వామి ఆలయ అర్చకులు పరాంకుశం చక్రధర శ్రీనివాసాచార్యులు, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ అర్చకుడు గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు



స్థానిక చోడిదిబ్బ ప్రాంతంలో ఆటల పోటీలో పాల్గొన్న చిన్నారులు

ఏలూరు (టూటౌన్): యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా ఉండేందుకు సంక్రాంతి పండుగ సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ అన్నారు. భోగి పండుగ సందర్భంగా స్థానిక చోడిదిబ్బ ప్రాంతంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి అంటే కొంత మంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం కోడిపందేలు, జూద క్రీడలను ప్రోత్సహించి యువతను చెడు దారి పట్టే విధంగా చేస్తున్నారని అన్నారు. వాటి నుంచి మంచి వైపు మరల్చే విధంగా గ్రామాల్లో సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్ రాజా, స్థానిక పెద్దలు బొత్స సింహాచలం, శేఖర్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మేధోశక్తి వృద్ధికి చెస్ పోటీలు దోహదం



చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): చిన్నారుల్లో మేధోశక్తి వృద్ధి చెందేందుకు చెస్ పోటీలు దోహదం చేస్తాయని సీపీఎం జిల్లా క్యాదర్శి ఏ.రవి అన్నారు. డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజన ఉత్సవాల్లో భాగంగా జిల్లా చెస్ ఓపెన్ టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు ఆయన ఆదివారం బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి విద్యావిధానంలో పిల్లలు ర్యాంకులు సాధించాలని ఒత్తిడి పెంచే విధంగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. విద్యార్థులకు విద్యతోపాటు శారీరక, మానిసిక ఉల్లాసం కలిగించే ఆట పాటలను నేర్పించాలని అన్నారు. ప్రజా సంఘాలన్నీ కలిపి సంక్రాంతి సందర్భంగా ఇటువంటి ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఠాగూర్ రాజా, సీఐటీయూ నాయకులు పి.కిషోర్, చెస్ ఛీఫ్ ఆర్బిటర్ కృష్ణ కుమారి, కోచ్ డి.లక్ష్మణరావు, పి.హైమా తదితరులు మాట్లాడారు. సభ అనంతరం గెలుపొందిన విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్, నగదు బహుమతులు ప్రదానం చేసారు. జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంటు చాంపియన్‌గా సూర్యనారాయణ గెలుపొందగా, తరువాతి స్థానాల్లో సోనాలి శ్రీ మణి కార్తీక, షణ్ముక సాయి, సీహెచ్ వివేక్, పి.సుచిత్ర నిలిచారు.

వైభవంగా భోగి వేడుక

- ఉత్సాహంగా భోగి మంటలు వేసిన యువత
- సందడిగా మారిన గ్రామాలు



దెందులూరు: భోగిమంటలు చుట్టూ తిరుగుతున్న గ్రామస్తులు

దెందులూరు: దెందులూరు 10వ వార్డులో శ్రీరామ దండు దెందులూరు మండల కమిటీ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ఇంద్రవనంలో జీవ వైవిధ్య విధానంలో, గ్రామదీప్ నిర్వాహకులు వెలమాటి మనోహరి ఆధ్వర్యంలో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి హాజరయ్యారు. సనాతన భారతీయ ఇతిహాస సంప్రదాయాలు, సంస్కృతికి పండుగలు ప్రతిబింబాలని వారన్నారు. సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

భక్తి శ్రద్ధలతో భోగి పండుగ

భీమడోలు: భోగి పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం వేకువజామునే లేచి ఇళ్ల ఎదుట వీధుల్లో పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి సంప్రదాయ పాటలు పాడి అలరించారు.ఈ ఏడాది ప్రతి ఇంటా శుభాలు జరగాలని కోరుతూ మహిళలు, యువకులు భోగి మంటల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఆట పాటలతో సందడి చేసారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, లంక గ్రామాల్లో సైతం ప్రజలు సంస్కృతీసంప్రదాయాలు చాటే ఈ పండుగను కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటల్లో నీటిని కాచుకుని వాటితో స్నానాలాచరించారు.

సుదూర ప్రాంతాల నుంచి బంధువులు రాక

పెదవేగి : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి బంధువులు ఇళ్లకు చేరుకోగానే పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులకు భోగి పండ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు. మహిళలంతా కలిసి పిండి వంటలు చేశారు.

రంగవల్లుల పోటీల్లో జిల్లా స్థాయిలో సౌమ్య ప్రతిభ

దెందులూరు: ఏలూరులో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో దెందులూరు మండలంలోని చల్లచింతలపూడికి చెందిన వేమన సౌమ్య జిల్లా ప్రథమ బహుమతి గెలుపొందింది. ధర్మభేరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రంగవల్లుల పోటీల్లో జిల్లా మొదటి స్థానం సాధించిన సౌమ్యకు ఎల్ఈడీ టీవీని బహుమతిగా పారిశ్రామికవేత్త నారాశేషు, ప్లాష్ సంస్థ అధినేత శ్రీనివాస్ అందజేశారు.

సంతోషంగా సంక్రాంతి వేడుకలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. జగనన్న ఇళ్ల కాలనీల వద్ద సంబరాలు నిర్వహించారు. నారాయణపురం, చేబ్రోలు, కైకరం, ఉంగుటూరు వేడుకలు నిర్వహించారు.



పెదవేగి : పిండివంటలు చేస్తున్న మహిళలు



పెదవేగి : లక్ష్మీపురంలో రంగులతో ముగ్గు వేస్తున్న దృశ్యం



దెందులూరు: ముగ్గుల పోటీలో జిల్లా ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



భీమడోలు: భోగి మంటలు వేస్తున్న మహిళలు, యువతులు



పెదవేగి : భోగిమంట వేస్తున్న యువత



దెందులూరు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా దీపాలు వెలిగిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి



దెందులూరులో సంక్రాంతి సంబరాల్లో పాత కాలపు ఇత్తడి వస్తువులు ప్రదర్శన

కృష్ణా కాలువలో కొనసాగుతున్న గాలింపు

పెదవేగి : తోటికోడళ్ల అదృశ్యం ఘటనలో చిన్న కోడలు మృతదేహ కృష్ణా కాలువలో లభ్యం కాగా, పెద్దకోడలు ఆచూకీ లభించలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం పినకడిమికి చెందిన రూపాదేవి, స్వాతికి అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన పాలపాటి కామరాజు, తిరుపతమ్మల కుమారులు శ్రీనివాస్, శివసాయితో వివాహమైంది. కొంత కాలం తరువాత నుంచి వరకట్నం వేధింపులు ప్రారంభమయ్యాయి.పెద్దలు సర్దిచెప్పిన అనంతరం వేధింపులు అధికమవడంతో శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు తోటికోడళ్లు రూపాదేవి, స్వాతి ఇంటి నుంచి వెళ్లిపోయారు. అక్కడి నుంచి విజయవాడ చేరుకున్న ఆ ఇద్దరు శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడ్డారనే సమాచారంతో గ్రామం ఉలిక్కిపడింది. మహిళల పుట్టింటి బంధువర్గం, అత్తింటివారిపై దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు భారీగా మోహరించి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. స్వాతి (33) మృతదేహం శనివారం లభ్యమైంది, ఆదివారం పంచనామా, శవపరీక్ష నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని పెదవేగి ఎస్సై ఎంలక్ష్మణ్ తెలిపారు. మరో మహిళ రూపాదేవి ఆచూకీ తెలియరాలేదని, కృష్ణా కాలువలో గాలిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కేసులో నిందితులైన అత్తమామలు తిరుపతమ్మ, కామరాజును ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. మహిళల భర్తలైన అన్నదమ్ములు శ్రీనివాస్, శివసాయి పరారీలో ఉన్నారు.

మావి కూర పందేలు

బుట్టాయగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులంతా కోడి పందేలు నిర్వహించుకోవడం సంప్రదాయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆదివారం భోగి సందర్భంగా దుద్దుకూరు సమీపంలో సంప్రదాయ కోడిపందేలను ప్రారంభించారు. తమవి కత్తుల పందేలు కావని.. కూర పందేలు అని బాలరాజు తెలిపారు. కోళ్లు పోరాడి అలసిపోతాయని ఈ పందెంలో పారిపోయిన కోడి ఓడిపోయినట్లని చెప్పారు.

శివాలయానికి నంది వాహనం సమర్పణ

భీమడోలు: భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామికి కురెళ్లగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, దాత రావిపాటి గాంధీ గోపాలకృష్ణ ఆర్థిక సాయంతో సమకూర్చిన బల్లస్టాండ్ కలిగిన ఇత్తడి నంది వాహనాన్ని భోగి రోజైన ఆదివారం సమర్పించారు. ఆలయంలోని స్వామి వార్ల ప్రదక్షిణలు చేసేందుకు అవసరమైన 45 కేజీల గల ఇత్తడి నంది వాహనాన్ని రూ.65 వేలతో చేయించి ఆలయ పూజారి కాళ్లకూరి ఉమాశంకర్‌శర్మ, అభివృద్ధి కమిటీ నిర్వాహకులకు అందించారు. తొలుత ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, దాత రావిపాటి గాంధీ గోపాలకృష్ణ, వారి మాతృమూర్తి గోపమ్మను దుశ్శాలువాలతో ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.7,500 విలువ గల మంచినీటి నిల్వ ట్యాంకును రావిపాటి గాంధీ గోపాలకృష్ణ బహూకరించారు. తల్లి గోపమ్మ మంచినీటి కుళాయిను ప్రారంభించారు. దాత దాతృత్వాన్ని భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దలు బొమ్ము గాంధీ, అభివృద్ధి కమిటీ నిర్వాహకులు సుతాపల్లి ప్రసాద్, నాయకులు పున్నం గోపి, పూజారులు బృందావన శేషు తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో దాత గాంధీ గోపాలకృష్ణ కుటుంబ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

ఆకట్టుకునేలా అంబేడ్కర్ స్మృతి వనం

నిడమర్రు: విజయవాడ మైదానంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని, స్మృతి వనాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సంబంధించిన ముందస్తు సమీక్ష సమావేశం ఆదివారం బువ్వనపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వాసుబాబు నిర్వహించారు. బీసీ, ఎస్సీ నేతలతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ 200 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని, స్మృతి వనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అందరినీ ఆకర్షించేలా అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలిపేలా మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కైలైటింగ్, ఫౌంటెన్లు, గ్రంథాలయాలతో సర్వాంగ సుందరంగా అంబేడ్కర్ స్మృతి వనాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి ఆలోచనలకు మద్దతు తెలుపుతూ భారీ ఎత్తున్న విజయవాడ తరలి రావాలని ఎమ్మెల్యే వాసుబాబు పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గోగుంట గ్రామస్తుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో పాల్గొన్న గోగుంట గ్రామస్తులు

పెదపాడు: మండలంలోని గోగుంటలో గ్రామానికి చెందిన ఆడపడుచులు, సోదరుల ఆత్మీయ కలయికతో పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామం నుంచి వలసవెళ్లి వివిధ ప్రదేశాల్లో స్థిరపడిన వారంతా ఆదివారం కలిశారు. గ్రామానికి చెందిన ఆడపడుచుల కుటుంబాల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది గ్రామస్తులు పాల్గొని వారు ఎక్కడ స్థిరపడింది, చేస్తున్న ఉద్యోగ, వ్యాపార, వృత్తి వివరాలు వెల్లడించారు. సన్నిహితుల యోగక్షేమాలు తెలుసుకుని, వారితో తమకు ఉన్న అనుబంధాన్ని వివరించి, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తొలుత సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆట పాటలతో కోలాట నృత్య ప్రదర్శనలు చేసారు. అనంతరం అందరికీ ఆత్మీయ విందును అందించారు. ఈ సమావేశానికి ముఖ్యకారకుడైన కాకరాల రాజేంద్రప్రసాద్‌ను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని రాఘవయ్య, గోగుంట సర్పంచ్ తుమ్మల గిరిజ గోపాల కృష్ణ పాల్గొన్నారు.

చురుగ్గా శివాలయ నిర్మాణ పనులు



సత్యవోలులో శివాలయం పనులు పరిశీలిస్తున్న గ్రామ పెద్దలు, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు

పెదపాడు: సత్యవోలులో శివాలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తి అయినప్పటికీ ప్రహరీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం శివాలయ నిర్మాణ పనులను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను అభినందించారు. దీంతో పాటు గ్రామంలోని రామాలయం అభివృద్ధి పనులపై ఆయన ఆరా తీశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు సీజీఎఫ్ నిధులు మంజూరు ఉత్తర్వులను గ్రామ పెద్దలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయుడు టంగుడు ఆంజనేయులు, సీనియర్ బీసీ నాయకుడు బొమ్మి ప్రభాకరరావు, కొట్నాన వెంకట్రావు, శ్రీను పాల్గొన్నారు.

సంప్రదాయ పద్ధతిలో కోడి పందేలు

భీమడోలు/ గణపవరం/పెదపాడు: : సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ బద్ధంగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. రాజకీయాలకుతీతంగా గ్రామాల్లో జోరుగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. ఎల్ఈడీల వెలుతురులో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. భోగి రోజైన ఆదివారం మధ్యాహ్నం కోడి పందేలు ప్రారంభమయ్యాయి. ప్రతి పందెంలో రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు చేతులు మారుతున్నాయి. భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలు సాగుతున్నాయి. గుండుగొలనులో టీడీపీ నేతల ఆధ్వర్యంలో భారీ కోడి పందేల శిబిరం ఏర్పాటు చేసారు. అక్కడ పందేలు, గుండాట, పేకాట, కోసాట నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో పందేలు గెలిచిన వారికి మోటార్‌సైకిల్ అందించనున్నారు.




గుండుగొలనులో కోడి పందేల బరి

కోడి పందెం బరుల వద్ద సందడి


పెదవేగి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సంప్రదాయబద్ధంగా కోడి పందేలు స్థానిక నేతల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బరుల్లో నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు కొండలరావుపాలెంలో నిర్వహించిన పందాలను తిలకించారు. కొండలరావుపాలెంలో ఏర్పాటుచేసిన బరిలో లేడీ యాంకర్, ఇతర గాయకులు పాల్గొని సందడి చేశారు. ఈ కోడిపందాల్లో తెలంగాణా ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన కోడి పందేలను తిలకించారు.

ఉంగుటూరు మండలంలో


ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సంప్రదాయబద్ధంగా కోడిపందేలు నిర్వహించారు. పెద్ద బరులకు తెలంగాణ, రాయలసీమ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కోడిపందేలు ప్రియులు తరలివచ్చారు. బాదంపూడిలో బరి వద్ద రూ. 2 లక్షల విలువగల బుల్లెట్‌ను విజేతకు అందించేందుకు ఉంచారు. 9 పందేలలో 5 పందేలు గెలిచిన వారికి బుల్లెట్ బహుమతిగా అందజేయనున్నారు. నారాయణపురంలో ఏర్పాటుచేసిన కోడిపందేలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీ కోటగిరి వేర్వేరుగా వచ్చి కొద్ది సమయం తిలకించి వెళ్లారు. ఈ బరి వద్ద పూల డెకరేషన్లతో స్వాగతం బ్యానర్లు ఏర్పాటు చేశారు.



భీమడోలు : విజేతగా బహుమతిగా ఇచ్చేందుకు బుల్లెట్



భీమడోలు : గుండుగొలనులో బరి వద్ద పందెం కోళ్లు



పెదవేగి: ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి